సాక్షి
కాకినాడ
శనివారం । 26 । అక్టోబర్ । 2024



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.


10లో



మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

86 వేల క్యూసెక్కుల జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 86,182 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీరు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కులను వదిలారు. తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కులను వదిలారు.

న్యూస్‌రీల్

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు దుర్గా రమేష్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో చేనేత కులానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. కాకినాడలోని ఒక హోటల్‌లో శుక్రవారం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ పార్లమెంటు పరిధిలో ఉన్న చేనేత సంఘాలు, చేనేత కుల సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు పప్పు దుర్గా రమేష్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటు పరిధిలో చేనేత కులానికి జరుగుతున్న అన్యాయంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీహార్ మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కుల గణన నిర్వహించాలన్నారు. చేనేత మంత్రిత్వ శాఖను ఆ వర్గానికే కేటాయించాలన్నారు. ఎమ్మెల్సీ స్థానాలలో తమ కులానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ ఫెడరేషన్ నేతలు జగ్గారపు మల్లికార్జున్, కొల్లు వెంకటేశ్వరరావు, చిల్లపల్లి గణపతి, పొన్నగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పరుగు పందెంలో వెంకటదుర్గ ప్రతిభ



సామర్లకోట: మండలంలో చంద్రంపాలెం శివారు ఉప్పగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దేవిశెట్టి వెంకటదుర్గ 100 మీటర్ల పరుగు పందెం జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం జరిగిన అథ్లెటిక్స్‌లో పాల్గొని ఈ ఘనత సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ వీరబాబు శుక్రవారం తెలిపారు. వచ్చేనెల 2 నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వెంకటదుర్గ పాల్గొంటాడని ఆయన తెలిపారు. వెంకట దుర్గను హెచ్‌ఎం బీఎస్‌ఆర్‌కె భాస్కర్‌కుమార్, గ్రామ పెద్దలు అభినందించారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ విచారణ



జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు పర్యవేక్షణలో విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు

కాకినాడ లీగల్: కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు, ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు, ప్రైవేట్ వ్యక్తులను ఒక కేసు విషయమై నాలుగేళ్ల తర్వాత అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం కార్యాలయంలో గోప్యంగా విచారించారు. 2020 జనవరి 10 తేదీన కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగుల వద్ద, దస్తావేజు లేఖర్ల వద్ద రూ.1,29,640 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు పర్యవేక్షణలో అప్పటి సబ్ రిజిస్ట్రార్లు కేవీఎస్ కుమారి, ఎస్.శేఖర్‌బాబుతో పాటు ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు, ఆఫీసులో ఉన్న ప్రైవేట్ వ్యక్తులను నాలుగేళ్ల తర్వాత కార్యాలయంలో గది తలుపులు మూసివేసి విచారణ చేశారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ను విలేకరులు ప్రశ్నించగా పాత కేసుపై విచారణ సాగిందని చెప్పారు.

28న వలంటీర్ల ధర్నా

కాకినాడ సిటీ: ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన కాకినాడ కలెక్టరేట్ ముందు చేపట్టే భారీ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వలంటీర్లందరినీ కొనసాగిస్తామని, అధికారంలోకి రాగానే రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 28వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అనేక మంత్రి వర్గ సమావేశాలు జరిగినా వలంటీర్ల సమస్యల కనీసం చర్చించలేదని, రాష్ట్రంలో రెండు లక్షల అరవై వేల మంది వలంటీర్లు కూటమి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత సాధించేంత వరకు పోరాడాలని శేషబాబ్జీ, రాజ్‌కుమార్ అన్నారు. వీరికి సీఐటీయూ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు.

బాలారిష్టాలు అపార్‌ం



- యూనిక్ ఐడీ రూపకల్పనలో సమస్యలు
- ఆధార్, పాఠశాల రిజిస్టర్లు, జనన ధ్రువపత్రాలలో వ్యత్యాసాలు
- ఆధార్ కేంద్రం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు
- 20 శాతానికి మించని నమోదులు
- వన్ నేషన్.. వన్ స్టూడెంట్ విధానానికి మరింత జాప్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులకు అపార్ కష్టాలు వీడటం లేదు. భారత పౌరుడి పుట్టు పూర్వోత్తరాలు ఆధార్ కార్డులో ఎలా నిక్షిప్తం చేశారో అదే విధంగా విద్యార్థుల వివరాలు ఒకే కార్డులో భద్రపరచడానికి ఆటోమేటెడ్ పర్మెనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ యాజమాన్యాలు, ఎయిడెడ్, ప్రభుత్వ, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్డులు అందజేయడానికి ఏర్పాట్లు చేయగా నమోదు పక్రియ మరింత ఆలస్యమవుతోంది. ఇటీవల పాఠశాల విద్యార్థులకు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ ద్వారా ప్రతి విద్యార్థికి పర్మెనెంట్ ఎడ్యుకేషన్ నంబరు (పెన్) కేటాయించారు. ఈ నంబర్ ఆధారంగా రానున్న విద్యా సంవత్సరాల్లో విద్యార్థులకు అడ్మిషన్లు, రికార్డు షీట్లు, టీసీలు జారీ చేస్తారు.

విద్యార్థి పురోగతి తెలుసుకునే అవకాశం

విద్యార్థుల విద్యా సంబంధ విషయాల్లో పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, విద్యను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ అపార్ ఐడీ ఉపకరించనుంది. జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం ఈ ప్రత్యేక ఐడీని రూపొందిస్తున్నారు. అలాగే డిజిటలైజేషన్, పర్సనలైజ్డ్ లెర్నింగ్, బడి బయట లేదా చదువుకు దూరంగా ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలలకు చేర్పించడం ద్వారా విద్యను సార్వత్రికం చేయడం దీని ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెప్తున్నారు. దీని ద్వారా ప్రతి విద్యార్థి ఆయా విద్యా సంస్థల్లో సాధించిన విజయాలు, విద్యార్థి అకడమిక్ హిస్టరీ, డిజి లాకర్ ఇంటిగ్రేషన్ ద్వారా తీసుకున్న కోర్సులు, గ్రేడ్లు, సర్టిఫికేషన్లు ఇలా ప్రతి విషయాన్ని శాశ్వతంగా

ఇకపై విద్యార్థులందరికీ..

ప్రస్తుతం 9, 10, ఇంటర్మీడియెట్ విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఒకటి నుంచి డిగ్రీ విద్యార్థులందరికీ అపార్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు వెలవడనుండడంతో ఆ ఆ దిశగా అధికారులు కసరత్తు చేపట్టారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) కేంద్ర ప్రభుత్వం కేటాయించనుంది. పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకూ దేశంలో ఎక్కడైనా ప్రవేశాలు పొందే సమయంలో అపార్ నమోదై ఉంటే ఇతరత్రా పత్రాలు తీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం వన్‌నేషన్, వన్‌స్టూడెంట్ నినాదంతో ప్రత్యేకంగా రూపొందించిన 12 అంకెల గుర్తింపు వ్యవస్థనే అపార్‌గా చెబుతున్నారు. నమోదు గడువు ఏమీ లేకపోయినా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇప్పటికే వివరాలు నమోదుకు అధికారులు సాధ్యమైనంత కృషి చేస్తున్నారు.



ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న విద్యార్థులు

జిల్లాలో విద్యార్థులు, అపార్ నమోదుల వివరాలివీ..

తరగతి	విద్యార్థులు	నమోదులు
ఉన్నత పాఠశాలలు	58,423	21,650
ఇంటర్మీడియెట్	45,306	18,443

30 శాతానికి మించలేదు

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ముఖ చిత్రం తదితర వివరాలతో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో విద్యార్థి వివరాలన్నీ తెలుస్తాయి. అయితే చాలామంది విద్యార్థుల పేర్లు, పాఠశాల దస్త్రాల్లో రాసినట్టుగా ఆధార్‌లో లేవు. కొందరివి పుట్టిన తేదీలు లేకపోగా, సంవత్సరమో, నెలో, పుట్టిన తేదీలోనో ఏదో ఒకటి సరిపోలకపోవడంతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం వివరాల్లో మార్పులకు ఎంఈవో లాగిన్‌కు అవకాశం ఇచ్చామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు మాత్రం ఆధార్ నవీకరణను సద్వినియోగం చేసుకునేందుకు

విద్యాశాఖ ఏర్పాట్లు..

ప్రస్తుతం 9, 10, ఇంటర్మీడిమెట్ విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల ద్వారా ఐడీ క్రియేట్ చేస్తున్నారు. దానికి సంబంధించి సమ్మతి పత్రాలు ఇప్పటికే అందజేశారు.

వెళ్తున్న విద్యార్థులతో ఆధార్ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి

విద్యార్థుల అకడమిక్ డేటా భద్రంగా ఉంచేందుకు, గోప్యత పాటించేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. అపార్ ఐడీ వివరాలను అధీకృత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతా చర్యలను తీసుకుంటున్నారు. అపార్ ఐడీ జనరేషన్‌కు తల్లిదండ్రులు/ సంరక్షకుల సమ్మతి అవసరం. 18 ఏళ్ల లోపు విద్యార్థులు మైనర్లు అయినందున వారి తల్లిదండ్రులు/ సంరక్షకుల అనుమతితోనే అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు. అపార్ ఐడీ రూపొందించేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన అంగీకార పత్రాన్ని పాఠశాలలో భద్రపరుస్తారు. ఆధార్ నంబరు ఆధారంగా అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు. అందువలన ప్రతి విద్యార్థికి ఆధార్ నంబరు తప్పనిసరి. అపార్ ఐడీ ద్వారా విద్యార్థి సాధించే విజయాలు, అకడమిక్ ఫలితాలు, అభ్యసన స్థాయి తదితర సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వీలుంటుంది.

రికార్డు చేయడానికి ఉపకరిస్తుంది

దీని ద్వారా విద్యార్థులు వారి అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకోవచ్చు. అలాగే విద్యా సంస్థల మధ్య సులభతరంగా బదిలీ చేసుకునే వీలుంటుంది. ఉద్యోగాలు, ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థుల అకడమిక్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యే వీలుంది.

హెచ్‌ఎంలకు అవగాహన కల్పించాం



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి అపార్‌పై మండల స్థాయిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించి పత్రాలు అందజేసాం. విద్యార్థుల ఆధార్ కార్డుల్లో చిన్నచిన్న తప్పులు, అలాగే ఆధార్ అప్‌డేట్ లేకపోవడం వల్ల ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. 9, 10 తరగతులు పూర్తయిన తరువాత ఒకటి నుంచి 10వ తరగతి వరకూ ప్రతి విద్యార్థికి అపార్ కార్డు అందజేస్తాం.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

ఆధార్ వివరాలతో ఇబ్బందులు



విద్యార్థులకు అపార్‌పై సమ్మతి పత్రాలు అందజేసాం. ఆధార్ వివరాల్లో చాలా వరకూ లోపం ఉండటం వల్ల విద్యార్థుల అపార్ ఐడీ రూపొందించడానికి ఆలస్యం అవుతోంది. రికార్డులో ఉన్న వివరాలు, ఆధార్‌లో వాటికి తేడా ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– జీజీకే నూకరాజు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ జిల్లా

సమ్మతి పత్రం ఇచ్చారు



మా అబ్బాయి 8వ తరగతి చదువుతున్నాడు. అపార్ కార్డు కోసం సంరక్షకుల సమ్మతి పత్రం అందజేశారు. అపార్ కార్డు వల్ల భవిష్యత్‌లో చదువుకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ అపార్ నెంబర్ ద్వారా ఎక్కడ చదువుకున్నా విద్యార్థి విద్యా సంబంధ వివరాలు చాలా సులువుగా తెలుసుకోవడానికి అధికారులు వివరించారు.

– వై.ధనలక్ష్మి, విద్యార్థి తల్లి

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు



కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కాకినాడ పట్టణంలో రోడ్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి మున్సిపల్ కమిషనర్లకు పంపాలని ఆయన ఆదేశించారు. రద్దీ ప్రాంతాలలో పార్కింగ్ బోర్డులు వన్‌వే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దీపాలు లేని జంక్షన్లు, అప్రోచ్ రోడ్ల వద్ద కాషన్ లైట్లు, హైమాస్ట్ లైటింగ్, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఎన్‌హెచ్–216పై కత్తిపూడి–కాకినాడ మధ్య సిమెంటు రోడ్డుపై ప్రమాదాలకు కారణమౌతున్న గోతులను సరిచేయాలని కోరారు. పిఠాపురం కుక్కుటేశ్వర ఆలయం వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి కాంతు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన నమోదును విజయవంతం చేయండి

జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జేడీ ఎస్ సూర్యప్రకాశరరావు, ఇతర అధికారులతో పశుగణన ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. వికసిత్ ఆంధ్ర ప్రణాళిక రూపకల్పనకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ఇందుకు జిల్లాలోని 21 మండలాలకు అవసరమైన 296 మంది ఎన్యుమరేటర్లు, 54 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. అనంతరం భారత పశుగణన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయండి

జిల్లాలో ఆడ శిశువుల పట్ల వివక్ష, భ్రూణ హత్యల నివారణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గుర్తింపు పొందిన 153 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మూడోవ అదనపు జిల్లా జడ్జి పి కమలాదేవి, డీఎంహెచ్‌వో ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సత్యదీక్షలు

- కార్తికమాసానికి రత్నగిరిపై విస్తృత ఏర్పాట్లు
- విభాగాల వారీగా ఈఓ పరిశీలన

అన్నవరం: రత్నగిరిపై కార్తిక మాసోత్సవాలకు ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. వచ్చేనెల ఒకటో తేదీతో ప్రారంభం కానున్న కార్తిక మాసానికి ముందు వచ్చే స్వామివారి జన్మ నక్షత్రం మఖ ఆదివారం 27వ తేదీన రానుంది. ఈ సందర్భంగా ఆ రోజు తెల్లవారుజామున సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవితో పాటు శంకరుల మూలవిరాట్‌లకు పంచామృత అభిషేకాలు చేస్తారు. అనంతరం సత్యదీక్షలను ప్రారంభించి నవంబర్ 23న వచ్చే మఖ నక్షత్రం రోజున దీక్ష విరమిస్తారు. 27 రోజులకు అవకాశం లేనివారు 18 రోజుల దీక్షకు ఆరో తేదీన, 9 రోజుల దీక్షకు 14వ తేదీన చేపడతారు. ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అడ్డతీగల ఏజెన్సీలో పవనగిరి స్వామీజీ ద్వారా 600 జతల దీక్షా వస్త్రాలు, కాకినాడ జిల్లాలోని పలు గ్రామాల్లో మరో 400 మంది భక్తులకు దీక్షా వస్త్రాలను దేవస్థానం అధికారులు పంపిణీ చేశారు.

కార్తికానికి చురుగ్గా ఏర్పాట్లు

కార్తికమాసంలో స్వామివారి దర్శనానికి వచ్చే లక్షలాది భక్తుల కోసం ఆలయంలో వివిధ విభాగాల్లో జరుగుతున్న ఏర్పాట్లను ఈఓ పరిశీలించారు.

30న హుండీ లెక్కింపు

అదే విధంగా ఈ నెల 30వ తేదీన సత్యదేవుని హుండీలను లెక్కించనున్నారు. నెలకు ఒకసారి మాత్రమే లెక్కించే హుండీలను కార్తిక మాసంలో మాత్రం రెండుసార్లు లెక్కించడం ఇక్కడి ఆనవాయితీ.

పశ్చిమ రాజగోపురం వద్ద తాత్కాలిక విశ్రాంతి షెడ్డు

పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో గతంలో సత్యదేవ అతిథిగృహం ఉండేది. దానిని కూలివేసి దాని స్థానంలో భక్తుల విశ్రాంతి షెడ్డు నిర్మించాలని అనుకున్నప్పటికీ కారణాంతరాలతో ప్రస్తుతం తాత్కాలిక షెడ్‌ను నిర్మించనున్నారు. శుక్రవారం రాత్రి నుంచి షెడ్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు. వర్షాలు పడినా సమస్య లేకుండా దేవస్థానం ఈఈ రామకృష్ణ, డీఈ రాంబాబు ఆధ్వర్యంలో ఐదు అడుగుల గోడ, దాని పక్కనే డ్రైను నిర్మిస్తున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఇటీవల దేవస్థానానికి వచ్చిన బస్సులను ఆదివారం నుంచే ప్రారంభించనున్నట్టు ఈఓ తెలిపారు. రూ.80.6 లక్షలతో కొనుగోలు చేసిన రెండు బస్సులను రత్నగిరి–అన్నవరం రైల్వేస్టేషన్ మధ్య నడపనున్నట్టు ఆయన తెలిపారు.



ఆదివారం ప్రారంభించనున్న నూతన బస్సులు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవస్థానం ఇంజినీరింగ్ సిబ్బంది

రేపు సమన్వయ సమావేశం

కార్తిక మాస ఏర్పాట్లపై తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు, ఆర్డీఓ తదితర శాఖల అధికారులతో పాటు, ఈఓ రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం సమన్వయ సమావేశం జరగనుంది.

ప్రదక్షిణ వేళ ప్రాణం విలవిల..

- పంచారామ క్షేత్రంలో రాతి పలకలతో అవస్థలు
- ఎగుడుదిగుడు నేలపై గాయాలపాలవుతున్న భక్తులు
- పురావస్తుశాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం
- కార్తిక మాసోత్సవాల తరువాత ప్రారంభిస్తామంటున్న అధికారులు

సామర్లకోట: కాకినాడ జిల్లాలోని సామర్లకోటలో కొలువైన పంచారామ క్షేత్రం పురావస్తు శాఖ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంగా పిలుస్తారు. ఈ ఆలయంలో శివలింగాన్ని స్వయంగా కుమార స్వామి ప్రతిష్ఠ చేయడం వల్ల ఆ పేరు వచ్చిందన్నది పురాణ గాథ. క్రీస్తు శకం 892–922 సంవత్సరాల మధ్య ఈ ఆలయాన్ని చాళుక్య భీముడు నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుంది. అటువంటి ప్రాధాన్యత కలిగిన ఆలయాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ ఆలయ నిర్వహణ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉండగా, అభివృద్ధి పనులు మాత్రం పురావస్తుశాఖ స్వాధీనంలో ఉన్నాయి. దాంతో ఆలయంలో మేకు కొట్టాలన్నా పురావస్తు శాఖ అధికారుల అనుమతి ఉండాలి.

కార్తిక మాసంలో తప్పని ఇబ్బంది

నవంబరు ఒకటి నుంచి కార్తికమాసం ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు భక్తులు ఈ ఆలయానికి వేకువ జామునే వచ్చి ప్రదక్షిణలు చేస్తారు. తెల్లవారు జామున, సాయంత్రం ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఈ మాసంలో ఐదు ఆదివారాలు, 4 సోమవారాలు, కార్తిక పౌర్ణమి, స్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర, మాసశివరాత్రి, అమావాస్య రోజున కోటి దీపోత్సవం, జటాజూటం అలంకరణల రోజున భక్తులు పోటెత్తుతారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నిధులు వచ్చి 8 నెలలు దాటినా పనులు ప్రారంభించక పోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం



ఆలయ ప్రాంగణంలో అడుగు అడుగునా ఎగుడుదిగుడుగా ఉన్న రాళ్లు

ఆలయ ప్రాంగణంలో రాళ్ల నేలతో భక్తుల ఇక్కట్లు

పంచారామ క్షేత్రంలోని కోనేరు అభివృద్ధి పనులతో పాటు, ఆలయ ప్రాంగణంలోని ఫ్లోరింగ్ పనులు చేయాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. కోనేరు అభివృద్ధి పనులను పురావస్తుశాఖ అధికారులు మొక్కుబడిగా పూర్తి చేసి చేతులు దులుపుకొన్నారు. అదే విధంగా ఆలయంలోని ఉప ఆలయాల వద్ద చేసిన ఫ్లోరింగ్ పనులు కూడా నాసికంగా పూర్తిచేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు ఆలయంలోకి ప్రవేశిస్తూనే ప్రధాన మూర్తి ఉన్న నిర్మాణం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఫ్లోరింగ్ కాలక్రమంలో ఎగుడుదిగుడుగా తయారై భక్తులకు అసౌకర్యంగా మారింది. భక్తులు ప్రదక్షిణలు చేసే సమయంలో పైకి లేచిన రాళ్లు కాళ్లకు గుచ్చుకుని రక్తస్రావం కావడం, లేదా కాలు మడతపడి బెణకడం సంభవిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని గత శివరాత్రి ముగిసిన వెంటనే ఫ్లోరింగ్ పనులు ప్రారంభిస్తామని పురావస్తు శాఖ అధికారులు చెప్పారు. అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభించక పోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి

పంచారామ క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలి. ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ పనులు వేగంగా పూర్తి చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఫ్లోరింగ్ రాళ్లను గమనించక పోవడం వలన కాళ్లకు దెబ్బలు తగులు తున్నాయి. భక్తులు వేచి ఉండ డానికి విశ్రాంతి భవనం పనులు కూడా వేగంగా పూర్తి చేయాలి.

– డాక్టర్ వసల సత్యానందరావు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, సామర్లకోట

అంచనాలు తయారు చేశాం

పంచారామ క్షేత్రంలో ఫ్లోరింగ్ పనులు గత మహాశివరాత్రి ఉత్సవాలు పూర్తి అయిన తరువాత ప్రారంభించాలని నిర్ణయించాం. ఈ మేరకు అంచనాలు తయారు చేశాం. ఈ ఏడాది నిధులు రావలసి ఉంది. నిధులు వచ్చిన తరువాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– కేవీవీఎస్ఎస్ మూర్తి, పురావస్తుశాఖ సీఏ, కాకినాడ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కిరాణా వ్యాపారి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన కిరాణా వ్యాపారి మృతి చెందాడు. బొమ్మూరు ఎస్సై కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం పంచాయతీ వార్డు మెంబరు, వ్యాపారి అయిన బోడెం నాగేశ్వరరావు (40) దసరాకు తన గ్రామంలో కిరాణా దుకాణం ప్రారంభించాడు. దానిలో సరుకులను కొనుగోలు చేయడానికి శుక్రవారం మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లాడు. సరుకులతో పాటు ఉల్లిపాయల బస్తాలను తీసుకువస్తుండగా దివాన్ చెరువు వద్ద వెనుక నుంచి అతి వేగంగా వాహనం ఢీకొని వెళ్లిపోయింది. మోటారు సైకిల్‌కు వెనుక కట్టిన ఉల్లిపాయల బస్తాలకు ఆ వాహనం తగులుకోవడంతో నాగేశ్వరరావు కింద పడిపోయాడు. అతని తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న వెంకటాపురం సర్పంచ్ గంగరాజు సంఘటనా స్థలానికి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును బొమ్మూరు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ముమ్మిడివరం: గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన తాడాల దుర్గాప్రసాద్ (25) తల్లిదండ్రులతో కలిసి ముమ్మిడివరం పోలీసు క్వార్టర్స్ వెనుక వీధిలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరి కూడా అనారోగ్యంతో పుట్టింటి దగ్గరే ఉండి వైద్య సేవలు పొందుతోంది. అయితే వైద్య చికిత్సకు డబ్బులు లేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. దుర్గాప్రసాద్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడిని మందలించారు. దీంతో ఈ నెల 23న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరిన అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

240 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం


పిఠాపురంలో పట్టుబడిన కల్తీ నెయ్యి

పిఠాపురం: పిఠాపురంలోని ఇక ఇంట్లో కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న ముఠాను అధికారులు పట్టుకున్నారు. అక్కడ 240 కేజీల కల్తీ నెయ్యిని, దాని తయారీకి ఉపయోగిస్తున్న సామాగ్రిని సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పిఠాపురం రోడ్డు నంబరు 2 పద్మావతి నగర్‌లోని బండారు ఫణి ప్రసాద్ ఇంటిపై మున్సిపల్ అధికారులు దాడి చేశారు. అక్కడ ఆవు కొవ్వుతో తయారు చేస్తున్న నెయ్యిని గుర్తించారు. దాన్ని దేవాలయాలకు సరఫరా చేస్తున్నట్లు తయారీదారులు తెలిపారు. కాగా.. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

బ్రహ్మోత్సవం.. నేత్రపర్వం

- ఘనంగా వాడపల్లి వెంకన్న ఉత్సవాలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుపతి
- మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం


వేంకటేశ్వస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈవో


ఆకట్టుకున్న కళాకారుల వేషధారణ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ నిర్వహించారు. మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామంలో భారీ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సుప్రభాతసేవ అనంతరం ఉదయం తీర్థపుబిందెతో గౌతమీ గోదావరి జలాలను తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గోత్ర నామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా.. గరుడు వాహనంపై కొలువైన స్వామిని దర్శిస్తే బాధల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం.

నేటి కార్యక్రమాలు

వేంకటేశ్వరస్వామికి శనివారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమాలు, వేంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ జరపుతారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసిన ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేరాల అదుపునకు ప్రత్యేక బృందాలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్
- తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు


తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్ కుమార్

తుని రూరల్: ఏలూరు రేంజ్ పరిధిలో నేరాలు అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి శుక్రవారం ఆయన తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఐజీ విలేకర్లతో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో జాతీయ రహదారిని ఆసరా చేసుకుని ఏజెన్సీ, ఒడిశా ప్రాంతాల నుంచి సాగుతున్న గంజాయి అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలను నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న దాబాలు, హోటళ్లలో చొరబడి దోపిడి, హత్యలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో ఎనిమిది వేల సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అలాగే ప్రైవేట్ వ్యాపార సంస్థలు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. నేరాల దర్యాప్తు, నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపతాయన్నారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల కారణంగా కలిగే అనర్థాలపై మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు జి.చెన్నకేశవరావు, గీతా రామకృష్ణ ఉన్నారు.

ప్రమాదవశాత్తూ కార్మికుడి మృతి

పిఠాపురం: షెడ్డు నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివర్లాలోకి వెళితే.. పిఠాపురం మండలం కందరాడలో బాలాజీ రైస్ మిల్లులో షెడ్డు నిర్మాణం చేపట్టారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన పుట్టి వెంకట రమణ (36) అక్కడ పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం షెడ్డు నుంచి కాలుజారి కింద పడ్డాడు. అతడి తలకు రేకు బలంగా తగలడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకట రమణకు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో పక్షవాతంతో మంచాన పడిన వృద్ధురాలిపై ఈ నెల 23న జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడైన అదే ప్రాంతానికి చెందిన లంకే సత్యనారాయణను శుక్రవారం సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై బి.శివకృష్ణ విలేకరులకు తెలిపారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు.

మద్యం దుకాణాలపై ప్రజాగ్రహం


ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న స్థానికులు


గూడపల్లిలో మద్యం షాపు ముందు ధర్నా చేస్తున్న ప్రజలు


ఏంస్సైకి వినతిపత్రం అందజేస్తున్న నీలాద్రిరావుపేట గ్రామస్తులు


అమలాపురంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు జారీ చేశారు. ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చనే నిబంధన ఉండడంతో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు లైసెన్సుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు ఆందోళనలు చేస్తున్నారు. ఏలేశ్వరంలోని మెయిన్ రోడ్డును ఆనుకుని మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు చర్యలు చేపట్టారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ వద్ద స్థానికులు ఆందోళన చేశారు. నిత్యం మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుచేయడం దారుణమన్నారు. అక్కడకు వచ్చే మందుబాబులతో మహిళలు అవస్థలు పడే అవకాశం ఉందన్నారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, టీడీపీ నేత పైల సత్యనారాయణ సంఘీభావం తెలిపారు.

షాపు తొలగించాలి

మలికిపురం: గూడపల్లిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద శుక్రవారం ఆ గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. అక్కడికి సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా పాఠశాల విద్యార్థులతో పాటు నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. కొణిదెల శ్రీనివాసరావు, కుడిపూడి పండు, కొల్లి సుబ్బరాజు, పాటి సూర్యనారాయణ, కె.నానాజీ పాల్గొన్నారు

వేరేచోటుకు మార్చాలని వినతి

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని రామభద్ర చెరువు పక్కన గల ఖాళీస్థలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దానిని వేరేచోటుకు మార్చాలంటూ గ్రామస్తులు శుక్రవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. అక్కడ మద్యం దుకాణం ఉంటే ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ మేరకు నేదూరి సతీష్, రాంబాబు, మలిరెడ్డి అప్పారావు, తుపాకుల బాబీ, కాపు తదితరులు వినతిపత్రం అందజేశారు.

మద్యం షాపును మార్చాలి

పి.గన్నవరం: స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించాలని ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారు నాయుడు, తోరం వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, యాండ్ర విజయలక్ష్మి తదితరులు పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతూ పి.గన్నవరం నుంచి మూడు గ్రామాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు ఏటిగట్టు సెంటర్‌లో ఆటోల కోసం వేచి చూస్తారన్నారు. ఆటో స్టాండ్ ఎదురుగా మద్యం షాపు ఉండడంతో విద్యార్థినులతో పాటు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ మేరకు అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీపీ ప్రసాద్, కొత్తపేట ఎక్సైజ్ సీఐ, పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

యువతి కిడ్నాప్‌కు యత్నించిన 9 మందిపై కేసు

కొత్తపేట: తల్లి, సోదరుడితో కలిసి వెళుతున్న యువతిని దారిలో అడ్డగించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన దంగేటి వెంకటరత్నం అనే మహిళ ఈ నెల 20వ తేదీని తన కుమారుడి ద్విచక్ర వాహనంపై తన 22 ఏళ్ల కుమార్తెతో కలిసి అంబాజీపేట మండలం ముక్కామల గ్రామానికి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలోని సాయిబాబా గుడి వద్ద వారిని కోరుమిల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టి కృష్ణ, అతడి స్నేహితులు అడ్డగించారు. వెంకటరత్నం కుమార్తెను ప్రేమ కారణం చూపి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మృతదేహం భాగాలు

అన్నవరం: తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బత్తిన మధుబాబుది సహజ మరణం కాదని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏవీ నగరం శ్మశానవాటికలో పూడ్చిన అతడి మృతదేహాన్ని శుక్రవారం తవ్వి బయటకు తీశారు. తుని ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆ మృతదేహంలో ముఖ్యమైన భాగాలను తీసి వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తహసీల్దార్ మురార్జీ, ఎస్సై జగన్‌మోహనరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మధుబాబును అతడి భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్ హత్య చేశారని మధుబాబు బంధువులు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు.

రత్నగిరిపై ఇద్దరు పురోహితుల సస్పెన్షన్

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తులను కానుకలు డిమాండ్ చేశారన్న ఆరోపణపై వ్రత విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు వ్రత పురోహితులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. వ్రతాల సమయంలో గోదానం, భూదానం పేరుతో కానుకలు ఇవ్వాలని వ్రత పురోహితులు పెండ్యాల వీఆర్‌బీకే శర్మ (రాము), రాయప్రోలు శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారని ఈ నెల 15, 22 తేదీలలో ఈఓకు భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని నలుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు.

29, 30 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల ప్రకారం రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు సంబంధించి పురుషులు, మహిళల విభాగంలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 29, 30 వ తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ /పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ అంశాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యోగా కోచ్ నాగేంద్రన్ 90329 34038, బాస్కెట్ బాల్ కోచ్ మోహన్‌దాస్ 96405 03679ను సంప్రదించాలని కోరారు.

టోర్నమెంట్ విజేతగా రామచంద్రపురం


ట్రోఫీని అందుకుంటున్న రామచంద్రపురం జట్టు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ కాలేజీయట్ బాస్కెట్ బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ ఎంపిక శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని అనుబంధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన జట్ల వివరాలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. మొదటి స్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కాలేజీ, మూడో స్థానంలో పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ నిలిచాయి. ఈ జట్లలోని క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మందితో పాటు అదనంగా మరో నలుగురిని యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకులు పీడీ రమణ (పీఆర్ కాలేజ్), కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.బాల సత్యనారాయణ, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డేవిడ్ పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల నరికివేత

రౌతులపూడి: పి.చామవరం - పారుపాక సమీపంలోని గుండబోలు కోటేశ్వరరావుకు చెందిన భూమిలోని కొబ్బరి మొక్కలను స్థానిక టీడీపీ నాయకులైన సర్పంచ్ నందమూరి రాజా, అతడి అనుచరులు గుండబోలు అప్పన్నదొర, అరిగెల రవీంద్ర తదితర 25 మంది శుక్రవారం నరికివేశారు. దీనిపై కోటేశ్వరరావు రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అడ్డువచ్చిన వారిని చంపివేస్తామంటూ బెదిరించారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకి ఏడాది జైలు, రూ.4.50 లక్షల జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ చెందిన బత్తిన రాణి నుంచి వరిపల్లి రత్నమాల 2020లో రూ.4 లక్షలు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.4.50 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును రాణి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. రత్నమాలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.